శ్రీ

చింతామణి.

ఇదిమాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౫.] రాజమహేంద్రవరము. దుర్ముఖి సంవత్సర వైశాఖ, జ్యేష్ఠమాసములు. [సంచిక. ౧౧.౧౨.

సంస్కరణము.

లక్ష్మీనారాయణ విలాపములోని ద్వితీయరంగమునందలి రెండవ పద్యములో "భార్య" యని యున్నదానిని 'దార' యని చదువుకోవలెను.

కృతివిమర్శనము.

సతీమణి:— యను పద్యకావ్యము వైజయంతీ పత్రికాధిపతులగు మ-రా-శ్రీ రాయబహదర్ పనప్పాకము అనంతాచార్యవర్య తనయులగు శ్రీనివాసాచార్యులు బి-ఏ- గారిచే రచింపఁబడినది. ఈకథ ఆంగ్లేయభాషలో 'కాంబెల్' అను కవీశ్వరుఁడు వ్రాసిన "ఓకానర్స్ చైల్డు" అను కావ్యమునందలి కథ ననుసరించి వ్రాయఁబడినది. ఆంగ్లేయకథ ననుసరించి వ్రాయుటలో నూతన మార్గము నవలంబించినట్లు గ్రంథకర్తగారు పీఠికయందు వ్రాసియున్నారు. కాంబెల్ గారు వారి యుద్యానవనములో 'నమరంథ్' (amaranthus caudatus) అను పుష్పవిశేషమును చూచి ఈకథను కల్పించెను. ఈపుష్ప మెప్పుడును వాడిపోనందున 'ప్రేమకుసుమ' మని వాడఁబడును. కథానాయకురాలగు శ్రీధామపురాధీశ్వరుని పుత్రిక తాను మోహించిన పురుషునితో గృహము విడిచిపోయి విపినభూములందు స్వేచ్ఛగా విహరించుచుండఁగా నామె సోదరులువచ్చి యామె మనోనాయకుఁడు కులహీనుఁడని వానిని యుద్ధరంగంబునఁ బరిమార్చి పాతిపెట్టిరి. అతని సమాధిపైని 'అమరాంథ్' అను పుష్పము బయలువెడలఁగా దానిని ప్రతిదినము తన కన్నీటఁ దడుపుచు నామె యాసమాధియొద్దనే కాలము గడపుచుండఁగా నొక పాంథుఁ డామెను చూచి

శ్రీ కాళహస్తి మాహాత్మ్యము.

ధూర్జటికవి ప్రణీతంబగు నీ గ్రంథము నూతనముగా నచ్చొత్తింపఁబడి ప్రకటింపఁబడినది. మ-రా-రా-శ్రీ ర- వేంకట సుబ్బయ్య బి. ఏ గారును, కొ- వెంకట పద్మనాభశాస్త్రిగారును ఈ గ్రంథమును 'నునుపుచేమించు దళసరి కాగితములపైఁ జక్కఁగ నచ్చొత్తించిరి' పండితులచే నీగ్రంథము సమ్యక్పరిష్కృతంబగుటచేఁ దప్పులు గానరావు. పద్యంబులెల్ల బాదమున కొకపఙ్క్తియు యతిస్థానములం గుర్తును గలిగి యుండును. 'శ్రీ జ్ఞానప్రసూనమాలిక' యను పేరఁ బ్రకటింపఁబడు గ్రంథరాజిలో నిది మొదటిది. శ్రీ జ్ఞానప్రసూనమాలికా ప్రథమసూనమగు నీ కాళహస్తి మాహాత్మ్యమునందలి కథ మిక్కిలి మనోహరముగా నుండును. శ్రీ యను సాలెపురుగును, కాళమను సర్పమును, హస్తియు నీశ్వరునిఁ గొలిచి సాయుజ్యమునొందిన స్థలమునకు 'శ్రీ కాళహస్తి' యనియు, చంద్రాలంకారునకు శ్రీ కాళహస్తీశ్వరుఁడనియు నామములు కలిగెను.

శా. గోగీశుండు చెలందిఁ బాముగజముఙ్ గైవల్య సామ్రాజ్య ల
క్ష్మీరూపంబగు తన్నుఁ గూర్చుకొనఁగా శ్రీ కాళహస్తీశ్వరుం। డైరాజిల్లె' నని

గ్రంథకర్త చెప్పియున్నాఁడు.

ఈ గ్రంథమునందు కన్నడపు పదములు పెక్కులు కానిపించుచున్నవి. ధూర్జటి శివభక్తుఁడు. ఈయన కవనము రసవంతమై మృదువైయుండును. పాకము ద్రాక్షాపాకము. ఈ కవీశ్వరుని శైలి యీ క్రిందిపద్యములవలనఁ దేటపడఁగలదు.

శా. కాంచెన్గాంచన పంకజాత విలసద్గంధాంధ సారంగ ఫే
నాంచ త్తుంగతరంగవారినిధి సీతాగాంతరాభంగ రో
మాంచస్వేద జలాశ్రుపూర జనకాత్మానంద సంపన్మనో
మంచాగ్రస్థిత విశ్వనాథపదసమ్యక్సంగ గంగానదిన్. తృతీయాశ్వాసము.

చ. తిమిర దినేంద్రజాజలముఁ దెచ్చి యజాండ ఘటంబునందుఁ బో
సి మరలఁ బశ్చిమాశయను చెల్వవహించిన పద్మరాగ కుం
భముగతి సూర్యుఁడుం జనియెఁ బ్రాక్సతి వెన్నెలవేల్పుచేటి తో
యము వడిఁబోయు హేమ కలశాకృతిఁ జంద్రుఁడు నొప్పె నయ్యెడన్.

చ॥ ఆ॥

యూహాపు చరిత్రను తెలిసికొనెను. ఆమె యిచ్చిన శాపముచే నామె సోదరులు రాజ్య భ్రష్టులై యడవులపాలయినట్లును, వారి రాజ్యము శత్రుసేనలపాలయినట్లునుకూడ వ్రాయఁబడియున్నది. తుదకీమె ప్రాణత్యాగముఁ జేసినట్లు శ్రీనివాసాచార్యులుగారి గ్రంథమందు వ్రాయఁబడియున్నది కాని మూల గ్రంథమునం దామె జీవించియున్నట్టే వ్రాయఁబడియున్నది. గ్రంథకర్తగారి శైలి మృదువై మధురముగానున్నది. గ్రంథాదియం దిష్టదైవప్రార్థనయు, తమ తండ్రిగారి ప్రశంసయుఁ జేసి గురువరేణ్యులకు నమస్కరించి, గ్రంథము పార్థసారథిస్వామి కంకిత మొనర్చిరి. గ్రంథకర్తగారి శైలి నుదాహరించుటకై కొన్ని పద్యముల నీక్రిందఁ బొందుపఱచుచున్నాము.

చ. కర పలరారు నీదుపురి గారవమొప్పఁబడంతులెల్ల నీ
సరసపుఁబల్కులన్ వినుచుఁ జంచలనేత్ర విలాస సంజ్ఞలన్
నెరపుచు సర్వకార్యముల నిన్నటుచుట్టుచు నిల్చువారలో
తరుణిరో! నేఁడిదేల మదిఁ దల్లడమందఁ గతంబుఁ దెల్పవే.

చ. సరసిజనేత్ర! కన్గవలజారెడు నశ్రులఁ జిమ్మవమ్మ, యీ
విరియిటువాడు వాఱఁగను వేఁడిగ నూర్పులఁ బుచ్చకమ్మ, యీ
కరణి వనాంతరంబున వగన్గుమఁ గుందకుమమ్మ నెంజెలిన్
బొరలుచు నీదు దేహలత పొల్పును వీడకుమమ్మ వేఁడెదన్.

తే. అర్యునాయశ్రుధారల నకటపెరిఁగెఁ
దీఁగె యియ్యదివిరి యిది దీనఁబుట్టెఁ
దలఁపఁ దలఁపంగ హృదయము తాపమొందు
నెట్టు లీలతాంతము కథ నెఱుకపఱుతు.

ఉ. కాంచనగంధి కాంచన వికారములైన సముజ్జ్వలప్రభో
దంచిత భూషణాళి రుచి యద్భుతకాంతుల నీనఁబ్రక్కలన్
సంచిత విక్రమాభ్యుదయ శౌర్యనిధుల్ భటులేపుమీఱఁగన్
మించు నృపోత్తముల్ గవయ మేలగు నీకును మాకుఁ జూడఁగన్.

ఉ. వాని మనోజ్ఞభాషణము, వాని వినోదకథావిశేషముల్
వాని సుధీబలంబకట వాని మనోహర సచ్చరిత్రముల్
వాని ముఖేందు కాంతులును వాని వికాసపుఁ గౌఁగిలింతలున్
నే నెటుగాంతు నింక గరుణింపరె దేవతలార నాపయిన్.

వలయువారు గ్రంథకర్తగారికి వ్రాసి గ్రంథములఁ బడయవచ్చును. వెల 3 అణాలు.

సుందరి.

చెన్నపట్టణములో నూతనముగా బయలువెడలుచున్న 'సుందరి' యను మాసపత్రికయొక్క మొదటిసంచిక మాకందినది. ఈ పత్రికాయుద్దేశములఁగూర్చి ప్రకటనలో 'అందు నానావిషయములు చేట తెలుగుమాటల వెలివేయఁబడును. ఇప్పు డిది చిన్నదిగానున్నదని తలఁచరాదు. అందరభిమానింతురేని క్రొత్తక్రొత్త విశేషములుగ నూనికతోడ నెలవేర్చగలనని యూరకకాడనేల' యని పత్రికాధిపతులు వ్రాసియున్నారు. మాకందిన సంచికలో "మహా సందేహము" లని కొన్ని యంశములు వ్రాయఁబడినవి. వీనిని బ్రకటించుటయందు పత్రికాధిపతి యుద్దేశమేమో మే మూహింపఁజాలకున్నాము. ఇట్టివిషయములఁ బ్రచురించినచో 'సుందరి' కళాహీనయై చూచుటకైన నసహ్యకరముగానుండును. కాఁబట్టి 'సుందరి' యభివృద్ధిని గోరు పత్రికాధిపతులు సర్వజనోపయోగమైన విషయముల బ్రచురించి ఈ నవీన సుందరిని బ్రకాశింపఁజేయుదురుగాత!

ప్రబంధకల్పవల్లి.

ఇది శ్రీ రాజయోగి పత్రిక కుపశాఖగా మ-రా-రా-శ్రీ గురజాడ శ్రీరామమూర్తి పంతులవారిచే క్రిందటి నెలనుండి ప్రచురింపఁబడుచున్నది. 'ఇట్లుండఁ బలుసంపుటికలెంత పనిచేయుచున్నను నింకను బ్రచురము కావలసిన పెక్కు పురాతన గ్రంథము లుండుటచేతను వాని నాంధ్రలోకము మిక్కిలి కాంక్షించుచుండుటచేతను వానిలో గొన్ని మారోదకుండుటచే బలు సంపుటికలకు సాహాయ్యంబుగ మా ప్రబంధకల్పవల్లిని గూడ మరల లేవదీసి చేతనయినంత యాంధ్రలోకంబున కుపకారం బొనర్చుట పురుషకారంబని యెంచినారము.' అని పత్రికాధిపతులు వ్రాసియున్నారు. ఈసంచిక యందు మాధవామాత్యుని చరిత్రంబును, పాతంజల యోగశాస్త్రమును నందిమల్లయ, ఘంట మలయమారుత కవి విరచితమైన ప్రబోధ చంద్రోదయమును, నవీన వచన ప్రబంధ మొకటియుఁ బ్రకటింపఁబడినవి. వీరి యుద్యమములు నిర్విఘ్నములుగాఁ గొనసాగుఁగాత!